




చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనలోని చిత్రాలు



రవీంద్రనాథ్ ఠాగూర్ చేతిరాత

ఆకట్టుకుంటున్న 'హిందుస్థాన్ ఫైల్స్' ప్రదర్శన

- 1757 నుంచి 1950 మధ్య కాలంలో జరిగిన సన్నివేశాలు, సామాజిక, రాజకీయ పరిస్థితులను తెలిపే విధంగా చిత్రప్రదర్శన
- మార్చి 7వ తేదీ వరకు కొనసాగింపు
- ఉదయం 10.30 నుంచి సాయంత్రం 7గంటల వరకు అందుబాటులో..
- సందర్శకులను ఆకట్టుకుంటున్న 400 చిత్రాలు







చిత్రప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు




మాదాపూర్: ప్రముఖ కళాకారులు వేసిన పెయింటింగ్, ఫొటో చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో హిందుస్థాన్ పేరిట చిత్ర ప్రదర్శనను గురువారం ఏర్పాటు చేశారు. 1757 నుంచి 1950 వరకు మధ్య కాలంలో తీసిన ఫొటో చిత్రాలను, పెయింటింగ్ చిత్రాలను, మరిన్నీ గ్రంథాలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ప్రముఖ కవులు, పెయింటర్లు వేసిన ఒరిజినల్ చిత్రాలను సందర్శకులకు అందుబాటులో ఉంచారు. భారతదేశంలో మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితులను పెయింటింగ్, డ్రాయింగ్, ఫొటోలు, డాక్యుమెంట్‌లు, మాన్యుస్క్రిప్ట్‌లు, లెటర్ల రూపంలో అందుబాటులో ఉంచారు. రామ్మోహన్‌రాయ్, రవీంద్రనాథ్ ఠాగూర్, వారెన్ హేస్టింగ్స్, టిప్పు సుల్తాన్, లార్డ్ కార్న్‌వాలీస్, తారాశంకర్ బందోపాధ్యాయ, శరత్‌చంద్ర చటోపాధ్యాయ, జామినిరాయ్‌లతో పాటు ప్రముఖుల ఉత్తర, ప్రత్యుత్తరాలు ప్రదర్శనలో కొలువుదీరాయి. స్వాతంత్ర ఉద్యమం, వాస్తుశిల్పం, యుద్ధాలు, మతపరమైన పద్ధతులు, సామాజిక జీవితం లాంటి ఛాయాచిత్ర ప్రదర్శన అద్భుతంగా సందర్శకులకు అందుబాటులో ఉంచారు. ఈ ప్రదర్శన మార్చి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. సందర్శకులకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

'సండే ఈవెనింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవెనింగ్ టాక్'కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'కాంప్రెహెన్సివ్ ఐ కేర్ అండ్ రైజ్ ఆఫ్ గ్లాకోమా'అనే అంశంపై విన్ విజన్ ఐ ఆస్పత్రుల గ్లోకోమా అండ్ కెటరాక్ట్ సర్జన్, ఎంబీబీఎస్ గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ నిమిషా శర్మ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

'నిథమ్' అసిస్టెంట్ లైబ్రేరియన్‌కు పీహెచ్‌డీ



యాదగిరి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని 'నిథమ్'లో అసిస్టెంట్ లైబ్రేరియన్ ఎస్.యాదగిరి పీహెచ్‌డీ డిగ్రీ సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని లైబ్రేరి అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం నుంచి పరిశోధక విద్యార్థి యాదగిరికి పీహెచ్‌డీ డిగ్రీ ప్రకటించారు. ఆయన ఢిల్లీ డీఆర్‌డీఓలోని డీఈఎస్ఐడీఓసీ డైరెక్టర్ డాక్టర్ కె. నాగేశ్వరరావు పర్యవేక్షణలో 'తెలంగాణ రాష్ట్రంలోని టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ లైబ్రేరీలపై ప్రత్యేక అధ్యయనం'అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్ సమర్పించగా దాన్ని పరిశీలించి, పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఆయనను పర్యవేక్షణ చేసిన డాక్టర్ నాగేశ్వరరావు, నిథమ్ ఫ్యాకల్టీ, విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

రాజకీయ నాయకులతో డీసీ సమావేశం



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన అనుమతులు, ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు. అదే విధంగా ఏప్రిల్ మొదటి వారంలో గచ్చిబౌలిలోని స్టేడియానికి ఈవీఎం వస్తాయని, వాటిని రాజకీయ పార్టీల సమక్షంలో పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్లు మోహ్రా, మాన్వి, సెక్టోరియల్ ఆఫీసర్ సంజయ్ కుమార్, ఏఈఆర్ఓ ప్రేమ్‌కుమార్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ బాలవర్ధన్, నాయకులు శ్రీహరి గౌడ్, జగదీష్, నజీర్ ఖాన్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కారు చోరీ

వ్యక్తికి రిమాండ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని రాయసముద్రం చెరువు కట్టపై పట్టణానికి చెందిన చిగురు శ్రీను కారును గుర్తు తెలియని వ్యక్తి కారుతో ఉడాయించిన సంఘటన తెలిసిందే. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 17వ తేదీ రాత్రి రామచంద్రాపురం పట్టణానికి చెందిన చిగురు శ్రీను తన కారుపై పట్టణంలోని రాయసముద్రం చెరువు కట్ట వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి చిగురు శ్రీనును మాటల్లో పెట్టి అతని కారుతో పరారయ్యాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు చోరీకి గురైన కారు రామన్నపేట్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్నట్లు గుర్తించి ఈ నెల 25న స్వాధీనం చేసుకున్నారు. సీసీ ఫుటేజీల ద్వారా కారును చోరీ చేసింది భారతినగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీకి చెందిన శ్రీనివాస్‌గా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు.

మెదక్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

- పార్టీ లోక్‌సభ అభ్యర్థి నీలం మధు ధీమా
- సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేత



సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు : కాంగ్రెస్ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, అందరి సహకారంతో మెదక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని పార్టీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన సందర్భంగా హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ ఎంపీ స్థానానికి నాడు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ లాంటి మహానేత ప్రాతినిధ్యం వహిస్తే నేడు పోటీ చేసే అవకాశం తనకు దక్కడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె హయాంలోనే ఈ లోక్‌సభ నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని చెప్పారు. ఈ విషయాన్నే ప్రజల్లోకి తీసుకొని వెళ్లి పార్టీ గెలుపొందేలా కృషి చేస్తానని తెలిపారు. మంత్రి రాజనర్సింహ, జగ్గారెడ్డి, మైనంపల్లి హన్మంతరావుల ఆశీస్సులతో ఎంపీ స్థానం పరిధిలో ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, నాయకులను కలుపుకొని ముందుకు వెళ్తానన్నారు.

హెచ్‌సీయూ-ఎన్ఎండీసీ మధ్య ఒప్పందం



ప్రతినిధులతో వైస్‌చాన్స్‌లర్ ప్రొ. బీజేరావు, ఎన్ఎండీసీ డైరెక్టర్ (ప్రొడక్షన్) దిలిప్‌కుమార్ మొహంతి తదితరులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ–నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) మధ్య ఒప్పందం కుదిరింది. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలో హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు సమక్షంలో రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ ద్వారా హెచ్‌సీయూ ఈ ఒప్పందం చేసుకుంది. భారతదేశంలో అతి పెద్ద ఇనుము ధాతువు ఉత్పత్తిదారు, నవరత్న పీఎస్‌యూతో ఒక అవగాహన ఒప్పందం ద్వారా గణనీయమైన భాగస్వామ్యాన్ని ఏర్పర్చుకోవడం విశేషం. అయిదు సంవత్సరాల కాలానికి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. హెచ్‌సీయూ నుంచి రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్, ఎన్ఎండీసీ లిమిటెడ్ పక్షాన ఆర్ అండ్ డీ సెంటర్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్‌కే జైన్ హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు సమక్షంలో వారిద్దరు సంతకాలు చేశారు. వీసీ ప్రొ. బీజేరావు, ఎన్ఎండీసీ డైరెక్టర్(ప్రొడక్షన్) దిలీప్ కుమార్ మొహంతి కలిసి సమర్థవంతంగా పనిచేయాలని, పరిశ్రమ-అకాడెమియా సహకారానికి విజయవంతమైన నమూనాగా మార్చడానికి ఇది మొదటి అడుగు అని చర్చించారు. హెచ్‌సీయూ నుంచి కోఆర్డినేటర్‌గా డాక్టర్ విజికొట్నూర్, ఎన్ఎండీసీ లిమిటెడ్ నుంచి డాక్టర్ విభూతి రోషన్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ ఎస్ఈఎస్‌టీ డీన్ ప్రొఫెసర్ జయప్రకాశ్‌గౌతమ్, ఫ్యాకల్టీ ప్రతినిధులు ప్రొఫెసర్లు వీవీఎస్ఎస్ శ్రీకాంత్, కేవీ రాజులపతి, డాక్టర్ వీజీ కొట్నూర్, ఎన్ఎండీసీ ప్రతినిధి డాక్టర్ విభూతి రోషన్ పాల్గొన్నారు.

మితిమీరిన వేగానికి చెక్..



- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- వేగాన్ని నియంత్రించేందుకు బారికేడ్స్, స్పీడ్‌బ్రేకర్స్ ఏర్పాటు
- వాహనాల తనిఖీలు ముమ్మరం

రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన వేగ నియంత్రణ బోర్డు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసు శాఖ ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. గతంలో శేరిలింగంపల్లి గోపన్‌పల్లి నుంచి తెల్లాపూర్ మీదుగా కొల్లూర్ రింగ్ రోడ్డు వరకు, శేరిలింగంపల్లి నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ ఇందిరా నగర్ మీదుగా మైహోం మీదుగా కొల్లూర్ రింగ్‌రోడ్డు వరకు రేడియల్ రోడ్లను అభివృద్ధి చేశారు. రోడ్డు విశాలంగా ఉండటంతో వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నారు. దీంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటునే ఉన్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ పోలీసుశాఖ వాహన వేగ నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేసింది.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు

ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసు అధికారులు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. లేబర్ క్యాంప్‌లలో సైతం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వాహనాలు నడిపేవాళ్లు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవడంతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తున్నారు.

ప్రమాద స్థలాల గుర్తింపు

రేడియల్ రోడ్లపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఇందిరానగర్ సర్కిల్ వద్ద బారికేడ్స్‌తో పాటు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా రోడ్లపై విద్యుత్ దీపాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేశారు.

స్పీడ్‌గన్ సహాయంతో చలాన్లు

ప్రమాదాలకు కారణం మితిమీరిన వేగమేనని గుర్తించిన అధికారులు అతివేగానికి బ్రేక్ వేయడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా రోడ్డుపై ఎంతవేగంగా వెళ్లాలని సూచించే హెచ్చరిక బోర్డులను రోడ్డు పక్కల ఏర్పాటు చేశారు. సూచించిన వేగం కన్నా ఎక్కువ వేగంతో వెళ్లే వాహనాలకు స్పీడ్‌గన్ సహాయంలో గుర్తించి చల్లాన్లను విధిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధలు పాటించాలి. నిబంధనలను పాటించని వారికి చలాన్లు విధిస్తున్నాం. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వాహనాదారులు ఎంత వేగంగా వెళ్లాలో సూచించే బోర్డులను ఏర్పాటు చేశాం. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలి. – పవన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, రామచంద్రాపురం

విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయాలి



రాత్రి సమయంలో రోడ్లపై విద్యుత్‌దీపాలు లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పోలీసుశాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలి. – సురేష్, తెల్లాపూర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ బోర్‌వెల్ కూలి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఉంగా, అతడి బావమరిది మేదియామి భీమా కలిసి 3 నెలల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి సాగర్ రోడ్డు వద్ద ఉంటూ బోర్‌వెల్‌లో పని చేస్తున్నారు. ఈ క్రమంలో సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్క్ సమీపంలో గురువారం తెల్లవారుజామున బోర్ వేస్తున్న క్రమంలో బోర్‌కు సంబంధించిన రాడ్ భీమాపై పడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. బోర్‌వెల్ యజమాని శ్రీధర్‌రెడ్డి, సూపర్‌వైజర్, సంజీవరెడ్డి నిర్లక్ష్యం కారణంగానే తన బామ్మర్ది చనిపోయాడని మృతుడి బావ ఉంగా ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు నెలల జీతాలు పెండింగ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న వర్కర్లకు నాలుగు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని కార్మికులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆస్పత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో 40 మంది కార్మికులు 12 సంవత్సరాలుగా పని చేస్తున్నారన్నారు. వీరంతా ఆస్పత్రిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, సెక్యూరిటీ, ఆపరేషన్ థియేటర్ పనులు, అంబులెన్స్ డ్రైవర్ ఇతర పనులు చేస్తున్నారన్నారు. వీరికి కేవలం 12 వేల రూపాయల వేతనం ఇస్తున్నారన్నారు. జీఓ 60 ప్రకారం రూ.15,600 వేతనం ఇవ్వాల్సి ఉండగా కాంట్రాక్టర్ బెదిరిస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. జీతాలు పెండింగ్ లో ఉంటే ఏ విధంగా జీవనం కొనసాగిస్తారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఎంకు వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో వీరేశ్, గోపాల్, నగేష్, రాంబాయి, రేణుక, సామయ్య, భిక్షపతి ఇతరులు పాల్గొన్నారు.



కార్మికులతో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు

నగదు అప్పగింత



నగదు అందజేస్తున్న నరేందర్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఓ వ్యక్తి ఏటీఎంలో సెంటర్‌లో మరిచి పోయి వదిలేసిన నగదును కొల్లూర్ పోలీసులు గురువారం బాధితుడికి అందజేశారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్‌లో నివాసం ఉండే శ్రీనివాస్‌రెడ్డి తెల్లాపూర్‌లోని ఏలియన్స్ స్పేస్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి కంపెనీకు చెందిన రూ.10లక్షల నగదును తీసుకొని డిపాజిట్ చేసేందుకు తెల్లాపూర్‌లోని ఓ ఏటీఎం సెంటర్ వద్దకు వెళ్లాడు. రూ.8లక్షలను మిషిన్‌లో డిపాజిట్ చేసి మిగిలిన రూ.2లక్షలను ఏటీఎం మిషిన్‌పై పెట్టి మరిచిపోయి వెళ్ళాడు. ఈ సమయంలో డబ్బులు డ్రా చేసుకోవడం కోసం ఉస్మాన్‌నగర్ చెందిన నరేందర్ ఆ ఏటీఎం సెంటర్ వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో ఏటీఎంపై ఉన్న నగదును చూసి వెంటనే కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌కు సమాచారం అందించాడు. డబ్బు మరిచిపోయిన శ్రీనివాస్‌రెడ్డి సైతం పోలీసులను ఆశ్రయించాడు. దీంతో ఇన్‌స్పెక్టర్ సంబంధిత నగదును గురువారం శ్రీనివాస్‌రెడ్డికి అప్పజెప్పారు. ఈ సందర్భంగా నరేందర్‌ను పోలీసులు అభినందించారు.